# ఉన్న మనిషి



– టి.వి.పద్మావతి

సాయంత్రం ఐదు గంటలు దాటింది.

ఉదయం వొదిలేసిన వార్తల్ని తీరిగ్గా చూస్తూ కూచున్నాడు ఆనందరావు.

గేటు అలికిడికి పేపర్ మడిచి అటువైపు చూశాడు.

సుమారు తన వయసువున్న ఓ వ్యక్తి తలుపు తీసుకుని వస్తున్నాడు. మనిషి కాసింత నలిగినట్లువున్నాడు. ఒకప్పుడు బాగా బ్రతికిన లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దగ్గరకు వచ్చి రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు.

"నా పేరు శంకరరావు" అన్నాడు.

నేను ప్రతినమస్కారం చేసి -

"రండి కూచోండి" అన్నాను.

కూర్చుని నా ముఖం వైపు చూసి విషయంలోకి డైరెక్టుగా వచ్చాడు.

"హరిత మా అమ్మాయి. మీ సంబంధం సుబ్బారావుగారు చెప్పారు. మీరు కూడా మా అమ్మాయిని చూసారని. పెళ్ళిచూపులు ఏర్పాటు చేసుకోమనీ చెప్పారట."

ఒకసారి సుబ్బారావు చూపిస్తే ఆ అమ్మాయిని చూశాను. చక్కగా వుంది. చూడగానే ఇలాంటి కోడలు కావాలనిపించింది. ఆ మాట సుబ్బారావుతో అన్నాను కూడా. ఆ అమ్మాయి తండ్రి అన్నమాట.

చిరునవ్వుతో ఆయన వైపు చూసి-

"అవునండి. అమ్మాయిని నేను చూశాను. మా ఆవిడ, అబ్బాయి కూడా చూస్తే బావుంటుందని చెప్పాను."

"తల్లిలేని పిల్ల. చిన్నతనం నుంచి ఎంతో గారాబంగా పెంచాను."

తెలుసన్నట్లు తలవూపాను.

"మేము మాత్రం ఎవరున్నాం చెప్పండి. అంతా కలిపినా ముగ్గురం."

"ఒకప్పుడు బాగా సంపాదించాను. పిల్ల పెళ్ళివయసు వొచ్చేసరికి ఏమీ మిగల్చలేక పోయాను." అతని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

"సుబ్బారావుగారు చెప్పిన కట్నం యిచ్చుకోలేను. పాతికవేలు మాత్రమే వున్నాయి" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

కనీసం లక్షరూపాయలు ఇస్తారని సుబ్బారావు మాట. మౌనంగా వుండిపోయాను.

"శారదా" కేక వేశాను.

ఐదు నిమిషాల తర్వాత శారద కాఫీ తీసుకుని వొచ్చింది.

శంకరరావు నా భార్య వైపు చూసి నమస్కరించాడు. మరింత పరిశీలనగా చూశాడు.

అంతే!

అతని ముఖంలో నెత్తురు చుక్కలేదు.

శారద కూడా అతని వంక అశ్చర్యంగా చూసింది.

"మన సాగర్‌కి చూడాలనుకుంటున్న హరితా వాళ్ళ నాన్నగారు" పరిచయం చేశాను.

తలదించుకుని కాసేపు కూర్చుని-

"మరి నేను వొస్తానండి" అన్నాడు శంకరరావు

"కూచోండి. నేను అలా బజారు వస్తున్నాను" అన్నాను.

"మళ్ళీ కలుస్తాను. పని వుందని" ఓ రెండు నమస్కారాలు నాకూ, నా భార్యకు పడేసి జీవంలేని నడకతో సాగిపోయాడు.

ఆ రాత్రి -

శారదను అడిగాను. శారదమాత్రం ఎప్పటిలా ప్రశాంతంగా చిరునవ్వుతో చూసి చెప్పింది.

"తొలిసారిగా నన్ను పెళ్ళిచూపులలో చూసి కట్నం తక్కువని వెళ్ళిపోయిన వారు ఈ శంకరరావు."

"ఓహ్..." అన్నాను.

శారద తన పెళ్ళిచూపుల విషయం చాలాసార్లు సరదాగా చెప్పేది. పేరు గుర్తు లేదు కానీ ఈ శంకరరావు విషయం కూడా చెప్పింది. కట్నం విషయం మాత్రం తనకు సంబంధం లేదని ఎంచక్కా జారుకున్నాడట. మరో సంబంధం జాతకాలు కుదర్క ఆ తర్వాత సంబంధం అబ్బాయి శారదకు నచ్చక - ఆ పిదప సంబంధం నేను. అప్పుడప్పుడు నేను చూసిన అమ్మాయిల్ని గురించి కూడా చెప్తూ గతంలోకి వెళ్తుంటాం.

"అయితే అతనికి నేను చాలా ఋణపడి వున్నాను" శారద ముఖంలోకి చూస్తూ అన్నాను.

శారద చిత్రంగా చూసింది.

"మరి ఇలాంటి అమ్మాయి నాకు లభించటానికి అతని పాత్ర కూడా వుందిగా"

శారద రవంత సిగ్గుతో తలవొంచింది.

"ఈ సంబంధానికి నీళ్ళు వొదిలేసి వెళ్ళినట్లుంది, నిన్ను చూసి "

"అలాగే వుంది."

"అందరూ తనలా డబ్బు మనుషులనుకుని వుంటాడు. డబ్బుని ఆశించి ఇప్పటికే అతను చాలా కోల్పోయాడు. కనీసం వాళ్ళ అమ్మాయికైనా సుఖంగా జీవించే అవకాశం కల్పిద్దాం. నువ్వేమంటావు?"

శారద నా ముఖంలోకి శాంతంగా చూసి-

"ఇన్నేళ్ల కాపురం తర్వాత కూడా అదేం ప్రశ్న?" అంది.

ఆమెను దగ్గరగా తీసుకుని అన్నాను.

"నాకు తెలుసు శారదా! నువ్వు నా భార్యవు. ఛా...ఛా... నేను నీ భర్తని" అన్నాను గర్వంగా.

"సర్లెండి వొదలండి" అంది నవ్వుతూ.

"సరే. కబురు చేస్తాను - మీ అమ్మాయే మాకు కావాలి అని".

నావైపు ఆరాధనాపూర్వకంగా చూసి తలవూపింది శారద. *

చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ!